సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 3 । జులై । 2023



దళితుల భూములు ఆక్రమిస్తే జైలుకే

దళితులకు చెందిన భూములు ఆక్రమిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మదనపల్లెకుక్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. - 8లో



మళ్లీ స్టాఫ్‌నర్స్ నియామకాలు

ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతోంది. రాయలసీమలోని ఆసుపత్రుల్లో ప్రధానంగా స్టాఫ్‌నర్స్ ఖాళీలు భర్తీ కానున్నాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.900	రూ.980
రెండోరకం	రూ.720	రూ.860



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1302 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	360	435
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 490.24 కిలోలు

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఈసీఈటీ ఫలితాల్లో ఒంటిమిట్ట వాసికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు



కాలి శంకరయ్య

రాజంపేట : ఈసీఈటీ ఫలితాల్లో రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి కాలి శంకర్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఈ విషయాన్ని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఈసీఈటీ పరీక్షలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో తమ కుమారుడు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం తమకెంతో సంతోషంగా ఉందని శంకరయ్య తల్లిదండ్రులు నరసింహులు, లక్ష్మీదేవి అన్నారు. ఐఈఎస్ కావడమే తన ధ్యేయమని విద్యార్థి తెలిపాడు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్‌ఓడీ సుజాత, అధ్యాపకుడు సాగర్‌రెడ్డిలు అందించిన సూచనలు, బోధన, ప్రోత్సాహం వల్లే ఈ ర్యాంకు సాధించగలిగానని చెప్పాడు.

7న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఊటీకి 7న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 7న శుక్రవారం రాత్రి బయలుదేరి బెంగళూరు, మైసూరు మీదుగా 8న ఉదయం ఊటీకి చేరుకుటుందన్నారు. ఆ రోజు అంతా ఊటీలో ఉండి 9న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకా షూటింగ్ స్పాట్, ముదుమలై ఫారెస్టు, బండిపూర ఫారెస్టు చూసి తరువాత అదే రోజు రాత్రి బయలుదేరి 10న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

ఐఎస్ఎస్-2023 సదస్సుకు ఆకేపాటి శ్రీయ



శ్రీయ

చిట్వేలి : చిట్వేలి నివాసి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆకేపాటి వెంకట రెడ్డి మనువరాలు ఆకేపాటి శ్రీయ అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతినిధిగా ఐఎస్ఎస్-2023(ఇంటర్నేషనల్ సైన్స్ స్కూల్)కు ఎంపికైంది. భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో ఐఐఎస్‌సీ బెంగళూరు వారు నిర్వహించిన కేవీపీవై పరీక్షలో 12వ ర్యాంక్ సాధించింది. అలాగే రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ బెంగళూరు) వారు నిర్వహించిన రెండంచెల రాత, మౌఖిక పరీక్షల్లో ప్రతిభచూపి భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే ఐదుగురిలో ఒకరిగా ఎంపికైంది. సదస్సులో పాల్గొనేందుకు సిడ్నీ చేరుకుంది.

ఖరీఫ్‌కు సన్నద్ధం!

- జిల్లాలో లక్ష హెక్టార్లలో పంటల సాగుకు అంచనా
- వరి పంట సాధారణ విస్తీర్ణం 9,748 హెక్టార్లు
- వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 50 వేల హెక్టార్లు
- 51,750 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ
- 14,602 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ
- జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా 750 కిట్లు వేరుశనగ, 9,000 కిట్లు కంది, 800 కిట్లు రాగి, 150 కిట్లు కొర్ర చిరు సంచులు పంపిణీ



సంబేపల్లెలో వేరుశనగ విత్తనకాయలను ట్రాక్టర్ గొర్రు ద్వారా వేస్తున్న దృశ్యం

రాయచోటి : వర్షాలు కురిసింది తడవుగా ఖరీఫ్ సాగును ప్రారంభించేందుకు అన్నమయ్య జిల్లా రైతులు సిద్ధమయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారులు సైతం వర్షాధారంగా ఖరీఫ్‌లో సాగయ్యే పంటల వివరాలతో పాటు వాటికి అవసరమయ్యే వేరుశనగ, వరి, ఇతర పంటల విత్తనాలను, ఎరువులను రాయితీపై ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. ఈ ఏడాది జూన్ మాసంలో అనుకున్నంత మేర వర్షాలు కురవలేదు. జిల్లాలో అక్కడక్కడా కురిసిన వర్షాలకు అనేక మంది రైతులు ఇప్పటికే వేరుశనగ పంటను విత్తే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వేసవి దుక్కులను పూర్తిచేసుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. రైతులు ఏ పంటలు సాగు చేస్తారు? ఎంత మేర విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయి? తదితర అంశాలతో వ్యవసాయ శాఖాధికారులు వానాకాలం సాగు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ వానాకాలంలో అన్ని పంటలు కలిపి ఒక లక్ష హెక్టార్లలో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. రైతులు వేరుశనగ సాగుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం ఇలా

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం ఒక లక్ష హెక్టార్లు. వరి పంట సాధారణ విస్తీర్ణం. 9,748 హెక్టార్లు వేరుశనగ సాధారణ విస్తీర్ణం 50 వేల హెక్టార్లు కాగా ఈ ఏడాది వేరుశనగ పంటసాగు మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వేరుశనగ విత్తనకాయలు వంద శాతం పంపిణీ

ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన, ధ్రువీకరించిన వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకేల) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. కె–6 నారాయణి రకాల విత్తనాలను 40 శాతం సబ్సిడీ పోను కిలో రూ.51.48కి వ్యవసాయ అధికారులు రైతులకు అందజేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 47,885 హెచ్ఏ. వేరుశనగ కనీస మద్దతు ధర రూ.5,550 కాగా గతేడాది రూ.6,500 వరకు పలికింది. ఈ ఏడాది రూ.6,800 నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది.

వరికి బదులుగా..

జిల్లా వ్యాప్తంగా రైతులు వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలతో పాటు వేరుశనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అధికారులు సైతం వరిపంటను తగ్గించి ఇతర పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. దీంతో అనేక మంది రైతులు ఆరుతడి, వాణిజ్య పంటలపైన దృష్టి సారించారు.

విత్తన కేటాయింపు ఇలా..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాలు 52,085 క్వింటాళ్లు అవసరంగా వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు జిల్లాకు విత్తన కేటాయింపు జరిగింది. ఇందులో కె–6 రకం 37,512 క్వింటాళ్లు, నారాయణి రకం 14,573 క్వింటాళ్లు కేటాయించారు.

ఆర్బీకేలకు చేరిన ఎరువులు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 39,956 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా గుర్తించారు. యూరియా 2,795 మెట్రిక్ టన్నులు, డీఏపీ 152, పొటాష్ 151, కాంప్లెక్సు ఎరువులు 236 మెట్రిక్ టన్నులు ఆర్బీకేలకు చేరాయి.

జాతీయ ఆహార భద్రత పథకం

జాతీయ ఆహార భద్రత పథకం కింద 750 కిట్లు వేరుశనగ, 9,000 కిట్లు కంది, 800 కిట్లు రాగి, 150 కిట్లు కొర్ర చిరు సంచులను పంపిణీ చేశారు. గ్రామ విత్తన పథకం కార్యక్రమాన్ని సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామంలో సజ్జ పంటపైన చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏబీవీ 04 రకం సజ్జ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించారు.

విత్తన కాయల కోసం ఇబ్బందులు పడేవాళ్లం



రైతు భరోసా కేంద్రంలో మూడు బస్తాలు వేరుశనగ విత్తనకాయలు తీసుకున్నాను. నాకున్న 2 ఎకరాల పొలంలో సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. గతంలో విత్తనకాయల కోసం ఇబ్బందులు పడేవాళ్లం. అప్పట్లో మండల కేంద్రానికి పనులు మానుకొని క్యూలో నిలబడి విత్తనకాయలు తెచ్చుకునే వాళ్లం. మా సమీపంలో ఉన్న ఆర్బీకేలో విత్తనకాయలు తెచ్చుకుంటున్నాం.

– దండు నారాయణరెడ్డి, రైతు, మోటకట్ల గ్రామ పంచాయతీ, సంబేపల్లి మండలం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



నేను రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనకాయలు సబ్సిడీతో కొనుగోలు చేశాను. నాకు 3 ఎకరాల పొలం ఉంది. వేరుశనగకు మంచి ధర ఉంది. రైతుల కష్టాలను పాదయాత్రలోజగనన్న చూసి చలించిపోయి రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్బీకేలను మా ముంగిటకే తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి, రైతు, మోటకట్ల గ్రామం, అన్నమయ్య జిల్లా

వ్యవసాయం పండుగ అవుతోంది



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా చేస్తోంది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే వైఎస్ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం విడుదల చేస్తోంది. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా ద్వారా రైతులకు నాణ్యమైన సేవలందిస్తున్న తీరు అద్భుతం. ఆర్బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు గ్రామస్థాయిలోనే అందించే ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించేందుకు నియోజకవర్గం స్థాయిలోనే వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే

వేరుశనగ విత్తనాలు వందశాతం పంపిణీ



ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నాం. వేరుశనగ విత్తనాల పంపిణీ వంద శాతం పూర్తయింది. కావాల్సినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయి. నెలాఖరుకు రైతు భరోసా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఎరువులు నిల్వ చేస్తాం. అనంతరం రైతులకు పంపిణీ చేస్తాం. వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలతో పాటు వేరుశనగ సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

– బి.చంద్రనాయక్, జిల్లా అగ్రికల్చర్ అధికారి, అన్నమయ్య జిల్లా

ఆర్బీకేలో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం



రైతులకు ఆర్బీకే స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందిస్తున్నాం. ఆర్బీకేల్లో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం. సీజన్‌కు ముందుగానే ధ్రువీకరించిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచుతున్నాం. కియోస్క్‌లో బుక్ చేసుకున్న గంటల్లోనే వాటిని డోర్ డెలివరీ చేస్తున్నాం. ఆర్బీకేలనే పంట కొనుగోలు కేంద్రాలుగా తీర్చిదిద్దాం. వ్యవసాయ శాఖ ద్వారా అన్నమయ్య జిల్లాలో వంద శాతం వేరుశనగ విత్తనకాయల పంపిణీ పూర్తి చేశాం.

– గిరీషా పీఎస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్

'ఎదమీటిన రాగాలు'కు కవితా పురస్కారం



కాశీవరపు వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య రాసిన 'ఎదమీటిన రాగాలు' కవితా సంపుటి ప్రతిష్టాత్మకమైన కొలకలూరి ఇనాక్ జాతీయ కవితా పురస్కారానికి ఎంపికైంది. సైమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఆదివారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారం అందుకోనున్నారు. ఈయన 1990లో ప్రసిద్ధ కవి రాధేయతో కలసి 'చైతన్య సాహిత్య కళావేదిక'ను స్థాపించి సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



సింహవాహనంపై సిద్ధేశ్వరుడు

రాజంపేట : తాళ్లపాకలో ఆదివారం శ్రీ సిద్ధేశ్వరస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ సిద్ధేశ్వరస్వామి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి సింహవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. భక్తులు కాయాకర్పూరం సమర్పించుకున్నారు. అలాగే శ్రీ చెన్నకేశవస్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సర్పంచ్ గౌరీశంకర్, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీ సిద్ధేశ్వరస్వామి అమ్మవారు

గరుడ వాహనంపై సౌమ్యనాథుడు



గరుడవాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడవాహనంపై సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా వాహన మండపంలో వాహనాన్ని సిద్ధం చేశారు. సౌమ్యనాథస్వామి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి గరుడవాహనంపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సునీల్, సాయి ఆధ్వర్యంలో హారతి ఇచ్చి, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా గరుడోత్సవంలో కళాకారుల కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. గరుడవాహనంపై స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కాయకర్పూరం సమర్పించుకున్నారు.



గొల్లపల్లిలోని దేశవాళీ ఆవులు

భళా.. దేశవాళీ.!

ఇప్పుడు దేశమంతా హైబ్రీడ్ వైపు చూస్తోంది. మొక్కలు, పశువులు, ఎరువులు, విత్తనాలు ఇలా అన్నీ సంకరజాతికి చెందినవే మార్కెట్‌ను శాసిస్తున్నాయి. అయితే ఈ ఊరు మాత్రం దేశవాళీకి చెందిన నాటు వైపు పయనిస్తోంది. ఊర్లో అన్నీ నాటు ఆవులే. పండించే పంటలన్నీ నాటు రకానికి చెందిన చిరుధాన్యాలే. ఎలాంటి రసాయనాలు లేని సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. ఇలా ఈ ఊరు మొత్తం సంప్రదాయ పద్ధతుల్లో 'నాటు' దేలిపోయింది. ఈ ఊరే మదనపల్లె మండలం గొల్లపల్లి గ్రామం. దీనిపై'సాక్షి' ప్రత్యేక కథనం..

SAKSHI SPECIAL

- సంకరజాతికి స్వస్తి
- ఊరు మొత్తం దేశవాళీ ఆవులే
- అదే గొల్లపల్లి ప్రత్యేకత



మండలం	: మదనపల్లె
గ్రామం	: గొల్లపల్లి
జనాభా	: 2,000 మంది
ఇళ్లు	: సుమారు 300
పశు సంపద	: నాటు ఆవులు 300కుపైగా
పంటలు	: వేరుశనగ, రాగులు, కొర్రలు, సజ్జలు
ఎరువులు	: పశువుల పేడ, కుళ్లబెట్టిన ఆకులు, కొమ్మలు

మదనపల్లె సిటీ : ఒకప్పటి దేశాన్ని చూస్తే నాటు ఆవులు, సేంద్రియ ఎరువులు, చిరుధాన్యాల పంటలు అధికంగా కనిపించేవి. అయితే కాలక్రమేణా సంకరజాతి పుట్టుకొచ్చి దేశవాళీ రకాలను పూర్తిగా కనుమరుగు చేసింది. అన్ని రకాల మొక్కలు, ఎరువులు, జీవాల్లో హైబ్రీడ్ ముంచెత్తింది. అయితే మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ గొల్లపల్లిలో మాత్రం సంకరజాతి ఆవులు కనిపించవు. అన్నీ దేశవాళీ ఆవులే. వాటి ద్వారా పాలను పొందుతున్నారు. వ్యవసాయమూ చేస్తున్నారు. ఇలా రెండు రకాలుగా ఉపయోగపడే ఆవులే ఈ ఊరికి ఇప్పటి పశుసంపద. వారు ఎలాంటి ఆధునిక పద్ధతులు వినియోగించకుండానే పంటలు పండిస్తుండటం మరో విశేషం. గ్రామస్తులు పాలు, ధాన్యాలు అన్నీ స్వచ్ఛమైనవి. ఆరోగ్యకరమైనవి మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. ఊరు మొత్తం దాదాపు 200 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో 99 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. మరో విశేషమేమంటే రైతులందరికి దేశవాళీ (నాటు) ఆవులున్నాయి. దాదాపు 300కిపైగా ఆవులున్నాయి. ప్రతి ఇంటా పాడి ఆవులతో కళకళలాడుతున్నాయి. వీటితో పాటు గొర్రెలు, మేకలు పెంపకం కూడా ఉంది. అవి కూడా అన్నీ నాటు రకమే. సమీపంలోని గొల్లపల్లి అటవీప్రాంతంలో ఉన్న చెట్ల ఆకులు, గడ్డి వంటివే ఈ జీవాలకు ఆహారం. ఊరిలో అసలు హైబ్రీడ్ అనే పదమే వారికి తెలియదు.

దేశవాళీ ఆవులే శ్రేష్టం

ఈ ఊరు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంది. ఇక్కడ కేవలం పాల ఉత్పత్తికి మాత్రమే ఆవులను పెంచితే, వ్యవసాయానికి ప్రత్యేకంగా పశువులు అవసరమవుతాయి. ఇలా రెండింటినీ వేర్వేరుగా పోషించడానికి భారం అవుతుంది. అందుకే రెండింటికీ ఉపయోగపడే నాటు ఆవులకే వీరు ప్రాధాన్యత ఇచ్చారు. సంకరజాతికి చెందిన పాడి ఆవులు వ్యవసాయానికి తట్టుకోలేవు. అదే నాటు ఆవులతో అయితే వ్యవసాయం ఎంతో సులభంగా చేయవచ్చు. వీటి పోషణకయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. పైగా మన వాతావరణ పరిస్థితులను తట్టుకునే శక్తి ఈ ఆవులకు ఉంటుంది. ఈ ఆవులుంటే తక్కువ ఖర్చుతో సేద్యం సాగిపోతుంది. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికి, నాణ్యమైన పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి లభ్యమవుతాయి. దీంతో స్వతహాగానే ఆరోగ్యం చేకూరుతుంది. మేతకు అటవీ ప్రాంతం అనువుగా ఉండటంతో ఈ ఊరు దేశవాళీ ఆవులకు అడ్డాగా మారింది.

పంటలన్నీ చిరుధాన్యాలే

సంప్రదాయ చిరుధాన్యాల పంటలకు గొల్లపల్లి పెట్టింది పేరు. గ్రామంలో వేరుశనగ, రాగి, సజ్జ, కొర్రలు పండిస్తారు. ఇప్పటికి పాతకాలపు పంటలు పండిస్తూ వాటితో రుచికరమైన వంటలు వండుకుని తినడంతో వ్యాధులు దరికి చేరవంటున్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల వారు రాగులు, సజ్జలు కావాలంటే గొల్లపల్లికి వెళతారు. దీని వల్ల వీరు పండించిన చిరు ధాన్యాలను కూడా మార్కెట్‌కు తరలించే అవసరం లేదు. వ్యాపారులే ఇక్కడికి వస్తారని గ్రామస్తులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి ప్రసిద్ధి

ఊరు మెత్తం ఇలా సంప్రదాయ సాగు పద్ధతులను అనుసరిస్తూ, ఎంతో ఆరోగ్యంగా జీవిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ పండిన చిరు ధాన్యాలకు చుట్టు పక్కల ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. పట్టణ వాసులు చిరుధాన్యాలు కావాలంటే గొల్లపల్లి బాట పడతారు. అయినా ఇక్కడ చిరుధాన్యాల ధరలు మాత్రం మార్కెట్ ధర కంటే తక్కువ.



గొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల




గొల్లపల్లిలోని రామాలయం

సేద్యానికి తోడూనీడ




నాటు ఆవులు సేద్యం సాగించేందుకు తోడూనీడగా మాకు సహకరిస్తున్నాయి. ఎంత కష్టమైనా భూములు దున్నడం, పంటలను తరలించేందుకు, ఎడ్లబండ్లను లాగడం వంటి పనులకు ఎంతో సహాయ పడతాయి. యంత్రాలు వచ్చినా వాటి ఖర్చు కంటే నాటు ఆవులతో తక్కువ ఖర్చుకే పనులు పూర్తవుతాయి. – కృష్ణమూర్తి, రైతు,గొల్లపల్లి.

పూర్వకాలం నుంచే..



మా తాత, ముత్తాల కాలం నుంచి నాటు ఆవులతోనే సేద్యం చేస్తున్నాం. మాకు 10 నాటు ఆవులున్నాయి. మా ఊర్లో రాళ్లు, బండలు ఎక్కువ. సేద్యం చేయాలంటే నాటు ఆవులకే తట్టుకుంటున్నాయి. దీంతో మా పెద్దల కాలం నుంచి నాటు ఆవులతోనే సేద్యం చేస్తున్నాం. – చంద్రశేఖర్, రైతు,గొల్లపలి

రాగుల కోసం పల్లెకు వస్తారు



పల్లెలో చిరుధాన్యాలు పండిస్తాం. పూర్వకాలం పద్ధతులతో పంటలు పండించడం వల్ల మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి రాగులు, సజ్జలకు వస్తారు. రసాయనాలు లేకుండా పంటలు పండించడం వల్ల మంచి డిమాండ్ ఉంది.

– పెద్దనారాయణ, రైతు,గొల్లపల్లి

అన్ని ఇళ్లలోనూ నాటు ఆవులే



గ్రామంలో అన్ని ఇళ్లలోనూ నాటు ఆవులే ఉన్నాయి. ఇప్పటికి సంప్రదాయ పంటలు పండిస్తున్నారు. పాత పంటల వల్ల ఆరోగ్యం బాగుంటుంది. ఎక్కడేకాని హైబ్రీడ్ ఆవులు లేవు. – సాలమ్మ, సర్పంచ్,పెంచుపాడు

క్లుప్తంగా

గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు జిల్లా ఎస్పీ గంగాధర్ రావు తెలిపారు. ఆదివారం రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొంత కాలంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లాల గంజాయి నేరస్తులను అరెస్టు చేశామన్నారు. నెల్లూరు జిల్లా రాపూరుకు చెందిన మేక రమణమ్మ, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన చింత గుంట నరసమ్మ జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో మన్నూరు సీఐ పుల్లయ్య, రైల్వేకోడూరు ఎస్ఐ మోహన్ కుమార్ కలిసి అరెస్టు చేశారని పేర్కొన్నారు. వారిని కోర్టులో హాజరు పెడుతున్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వక్కలపేటలో నివాసం వుంటున్న షేక్ హుసేన్‌సాబ్ కుమారుడు షేక్ హుసేన్‌పీరా (19) ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. తండ్రి, అతని సోదరులు మొబైల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను హుసేన్‌పీరాకు తీయించారు. అతను ఎవ్వరికీ ఇవ్వకుండా ఉపయోగించుకోవాలని కోరారు. దీంతో మానసిక ఆవేదన చెంది పరారయ్యాడు. ఈ మేరకు అతని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నరెడ్డయ్య అనే యువకుడు గాయపడ్డ సంఘటన చోటుచేసుకుంది. శ్రీ సత్యసాయిజిల్లా ఎన్.పి.కుంట మండలానికి చెందిన చిన్నరెడ్డెప్ప ద్విచక్రవాహనంలో దేవపట్ల వైపు నుంచి రాయచోటి వైపు వస్తున్నాడు. మండల పరిధిలోని నల్లగంగమ్మ క్రాస్ వద్ద ముందు వెళ్తున్న ఐచర్ వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రెడ్డయ్యను స్థానికుల సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు రెఫర్ చేసినట్లు సమాచారం.

మళ్లీ స్టాఫ్‌నర్స్ నియామకాలు

- త్వరలో 300 పోస్టుల భర్తీకి చర్యలు
- ఇప్పటి వరకు ఉన్న దరఖాస్తుల ఆధారంగానే..
- గత అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో జనవరిలో జరిగిన కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్‌ల నియామకాల్లో పెద్ద ఎత్తున బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూడడం కలకలం రేపింది. ఇదంతా ఆ శాఖ పరిధిలో పని చేసే కొంత మంది ఉద్యోగుల కుట్ర అనే ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా మరోమారు 300 కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్‌ల నియామకం జరగనుంది. ఇప్పటికే ఆ శాఖలో ఉన్న దరఖాస్తుల్లో బోగస్ సర్టిఫికెట్స్ ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. గతంలో జరిగిన సంఘటనలపై లోతుగా విచారణ చేపట్టడంతోపాటు తాజాగా చేపట్టే నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్స్‌కు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో జనవరిలో 291 కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ పోస్టుల నియామక ప్రక్రియ జరిగింది. ఈ పోస్టులకు మొత్తం 11,245 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా స్టాఫ్‌నర్స్‌ల నియామకం చేపట్టారు.

నియామకాల్లో వెలుగు చూసిన అక్రమాలు

ఈ నియామకాల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన ఒక అభ్యర్థి ఉద్యోగానికి ఎంపిక కాలేదు. అయినప్పటికీ ఏకంగా బోగస్ నియామక పత్రాన్నే సృష్టించుకొని పోస్టింగ్ కోసం చిత్తూరు జిల్లాకు వెళ్లింది. అక్కడి అధికారులు ఆమెకు ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడానికి ఖాళీలు లేవని తెలపడంతో అది బోగస్ నియామక పత్రం అని తేలింది. తరువాత ఏకంగా 16 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాను పొందుపరిచారు. దీంతో ఎక్కువ మార్కుల కారణంగా మెరిట్‌ను సాధించి 15 మంది ఉద్యోగాలు పొందారు. ఈ అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో బోగస్ సర్టిఫికెట్స్ పొందిన వారు ఉద్యోగాలను వదిలి అజ్ఞాతంలోకి వెళ్లారు. తరువాత చిత్తూరు జిల్లాకు చెందిన ఒక రిటైర్డ్ ఎస్ఐ బోగస్ అభ్యర్థులపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ 16 మందివి బోగస్ సర్టిఫికెట్స్ అని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు ధ్రువీకరించారు.

■ అనంతరం రెండవ సారి 85 మందికి స్టాఫ్ నర్స్ నియామకాలను చేపడితే అందులో కూడా ఇద్దరు బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన వారు బయటపడ్డారు. అలాగే ఈ కౌన్సెలింగ్‌కు 25 మంది హాజరు కాకపోవడం కూడా విచిత్రమే. బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన వారిలో కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరిని మినహాయిస్తే మిగతా వారంతా చిత్తూరు జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..

చిత్తూరు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఈ బోగస్ కుంభకోణాలపై పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులను సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగారు. దీనిపై 'చీఫ్ మినిస్టర్ క్యాంప్ ఆఫీస్' (సీఎంఓ) కార్యాలయం స్పందించింది. ఈ అంశాలపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి ఆదేశాలు చేరాయి. తరువాత విచారణ నిమిత్తం స్థానిక పోలీసులు ఆ శాఖ కార్యాలయానికి వెళ్లారు. బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన వారి సమాచారం తీసుకెళ్లారు.

తాజాగా పెద్ద సంఖ్యలో నియామకాలు

ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద ఎత్తున నియామకాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో త్వరలో మరోమారు పెద్ద సంఖ్యలో స్టాఫ్‌నర్స్ నియామకాలు జరగనున్నాయి. రాయలసీమ జిల్లాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా ఏర్పాటైన నంద్యాల మెడికల్ కాలేజీ, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీల స్థానాల్లో స్టాఫ్‌నర్స్ నియామకాలను చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నంద్యాల మెడికల్ కాలేజీ నుంచి మొత్తం 248 ఖాళీలు ఉన్నట్లుగా గుర్తించారు. ఇక వైద్య విధాన పరిషత్ నుంచి ఖాళీల వివరాలు అందాల్సి వుంది. ఇక్కడి నుంచి వివరాలు రాగానే ఒక వారం లోపు నియామక ప్రక్రియ జరగనుంది. మొత్తం దాదాపు 300 మంది స్టాఫ్‌నర్స్‌ల నియామకాలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఇప్పటికే ఉన్న దరఖాస్తుల ఆధారంగానే..

ఈ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ నియామకాలకు సంబంధించి జనవరికి ముందే దాదాపు 11,245 దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల ప్రామాణికంగానే జనవరిలో 291, రెండవ దఫాలో 85 మందికి నియామకాలను చేపట్టారు. తాజాగా ఆ దరఖాస్తుల ఆధారంగానే త్వరలో చేపట్టే 300 నియామకాల ప్రక్రియ జరుగనుంది. ఈ దరఖాస్తుల్లో కూడా పెద్ద సంఖ్యలో ఎక్కువ మార్కులు కలిగిన బోగస్ సర్టిఫికెట్స్ ఉన్నట్లుగా పలు ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా కొత్త నియామకాలు చేపట్టనుండడంతో మళ్లీ బోగస్ సర్టిఫికెట్స్‌ల అంశం తెరపైకి వచ్చింది. ఈ బోగస్ సర్టిఫికెట్స్‌ల వ్యవహారం ఆ శాఖ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ కోటేశ్వరి పని చేసిన సమయంలో వెలుగు చూసింది. ఇప్పుడు ఆమె అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై అమరావతికి వెళ్లారు. ఇప్పుడు ఆ స్థానంలో రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ అనిల్‌కుమార్ విధులను చేపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన తీసుకొనే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

బోగస్ సర్టిఫికెట్స్‌పై విచారణకు ఆదేశిస్తా



నేను ఇక్కడ బాధ్యతలను చేపట్టక ముందే బోగస్ సర్టిఫికెట్స్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి విచారణకు వచ్చిన పోలీసులకు పూర్తి సమాచారం ఇచ్చాం. ఆ వివరాలు తెలియాల్సివుంది. ప్రభుత్వ ఆదేశాలతో నిబంధనల ప్రకారం త్వరలో కొత్తగా స్టాఫ్‌నర్స్‌ల నియామకాలు చేపడుతున్నాం. ఈ నియామకాలకు సంబంధించి ఇప్పటికే తమ వద్ద అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులు ఉన్నాయి. వాటిల్లో బోగస్ సర్టిఫికెట్స్‌ను పరిశీలించాలని సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. ఏవైనా బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూస్తే ఆ అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు చేపడుతాం. నిబంధనల ప్రకారం నియామకాలను చేపడుతాం. అర్హులకు న్యాయం చేస్తాం.

– డాక్టర్ కేవీఎన్ఎస్ అనిల్‌కుమార్, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

దళితుల భూమి ఆక్రమిస్తే జైలుకే



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

మదనపల్లె : దళితులకు చెందిన భూములు ఆక్రమిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మదనపల్లె పట్టణంలోని బి.కె.పల్లికి చెందిన ఓ దళిత కుటుంబం భూ సమస్య పరిష్కారానికై, క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. సర్వే నంబర్ 522/1లోని 9.90 ఎకరాల భూమిని బాధితులు, స్థానికులు, అధికారులు, దళిత నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని గొల్లపల్లికి చెందిన దళితుడు రెడ్డప్ప సంతానమైన అనురాధ, వెంకటాచలపతి, మధుకుమార్‌లు తమ భూమిని మదనపల్లె పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన సుంకర వెంకటాచలపతి, బర్మావీధికి చెందిన బాయ్స్ శీనాలు ఆక్రమించుకుని, తమను బెదిరించి తప్పుడు కేసులు పెట్టించారని ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. సర్వే 522/1లోని 9.90 ఎకరాల భూమికి 1915లో వెంకిటిగాడు పేరుపై పట్టా పొందగా అనంతరం అతని కుమారులైన చిన్నప్ప, కొండప్ప పేరుపై భూమి బదిలీ జరిగిందన్నారు. వీరిలో చిన్నప్ప అవివాహితుడు కాగా కొండప్పకు ఏకైక కుమారుడు రెడ్డప్ప ఉన్నాడని తెలిపారు. రెడ్డప్ప మృతి చెందడంతో ఆ భూమిపై కన్నేసిన అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు రెడ్డప్ప వారసులను బెదిరించి భూమిని ఆక్రమించుకోవాలని దురుద్దేశంతో కేసులు పెట్టించడం జరిగిందన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు బాధితులకు అండగా నిలిచి న్యాయం చేయాలన్నారు. అందుకనుగుణంగా నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణరాజు, వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రభు, డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, సీఐ మురళీకృష్ణ, దళిత నాయకులు మునివెంకటప్ప, జయకుమార్, ముత్యాల మోహన్, మనోహర్‌రెడ్డి, రాయల సూర్య, రవిశంకర్, చిన్నా, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారణాలు తెలియాలి



సోహిత్ మృతదేహం

కడప అర్బన్ : జిల్లాలోని ఖాజీపేట మండలం పరిధి చెముళ్లపల్లె పంచాయతీలో వున్న బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్న సోహిత్ అనే విద్యార్థి మృతికి కారణాలు తెలియాలని తల్లిదండ్రులు నాగరాజు, లలితతోపాటు బంధువులు డిమాండ్ చేశారు. శనివారం మృతి చెందిన విద్యార్థి సోహిత్ (11) మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీలో వుంచారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమకు ఒక్కగానొక్క కుమారుడని, మరో కుమార్తె వున్నారని, పిల్లాడి మీదనే భవిష్యత్తును పెట్టుకుని జీవిస్తున్నామన్నారు. తమ కుమారుడి మృతికి గల కారణాలను తెలియజేసి, తమకు చట్టపరంగా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, కడప రిమ్స్ పీఎస్ సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ యోగా రాయల్, ఖాజీపేట ఎస్ఐ కుళ్లాయప్ప, స్పెషల్ పార్టీ పోలీసులు, ఇతర పోలీసు సిబ్బంది కడప రిమ్స్ మార్చురీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు విధులను నిర్వర్తించారు. ఈ సంఘటనలో తమ వంతు విచారణలో సహకారం, న్యాయం చేసేందుకు దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సురేంద్ర కడప రిమ్స్‌కు శనివారం వచ్చారు. తల్లిదండ్రులు, బంధువులను అడిగి విషయాలను తెలుసుకున్నారు. పోలీసుల సూచనల మేరకు, తల్లిదండ్రుల బంధువుల విజ్ఞప్తి మేరకు దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, ఇంకా కొందరు నాయకులు పాఠశాల వద్దకు వెళ్లారు. అక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అనంతరం కడపకు వచ్చి రిమ్స్ మార్చురీలో అప్పటికే పోస్టుమార్టం నిర్వహించిన సోహిత్ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తమ స్వగ్రామానికి తీసుకుని వెళ్లారు.



రిమ్స్ మార్చురీ వద్ద రోదిస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

సీసీ కెమెరాల ఫుటేజీ బయటపెట్టాలి

కడప ఎడ్యుకేషన్ : బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో విద్యార్థి మృతికి సంబంధించి పాఠశాలలో చోటు చేసుకున్న పరిణామాలపై సీసీ ఫుటేజీలను బహిర్గతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో మాట్లాడుతూ సోహిత్‌పై హాస్టల్ వార్డన్ దాడి చేశారని బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీసీ ఫుటేజీల విచారణ ఎంతో అవసరం ఉందన్నారు.

సోహిత్ మృతికి కారణమైన వార్డెన్ ఎవరనేది పోలీసులు తెలపడం లేదన్నారు. దీంతోపాటు విద్యార్థి మృతికి, స్కూల్‌కు సంబంధం లేదని యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక సర్క్యులర్‌ను విడుదల చేసిందన్నారు. ఇందతా ఉద్దేశ పూర్వకంగా కొంత మంది చేస్తున్నారని చెప్పడం దారుణం అన్నారు. ఇప్పటికే విద్యార్థులను తమ ఊర్లకు పంపారన్నారు. సంబంధిత విద్యార్థులను పోలీసులు పిలిపించి విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూప్‌తేజ్, సిద్ధార్థ, సూర్యప్రకాష్, రామోహన్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ పూర్తి చేసి నివేదిక ఇస్తాం





మీడియాతో మాట్లాడుతున్న విచారణ కమిటీ సభ్యులు, విచారణ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఖాజీపేట : బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ విద్యార్థి మృతిపై విచారణ పూర్తి చేసిన తరువాత ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ తెలిపింది. ఖాజీపేట మండలంలోని బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో విద్యార్థి మృతిపై కడప విద్యాశాఖ అధికారి ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ఆదివారం స్కూల్ వద్దకు వచ్చి విచారణ జరిపిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ ఏడీ దేవరాజు, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఏంఈఓలు స్వర్ణలత, సుబ్రమణ్య శర్మ మాట్లాడుతూ జరిగిన ఘటనపై కరస్పాండెంట్, ప్రిన్స్‌పాల్‌తోపాటు హాస్టల్ ఇన్‌చార్జి, రూమ్ విద్యార్థులు, విద్యార్థి ఉన్న ఫ్లోర్ ఇన్‌చార్జిలతోపాటు విద్యార్థి చుట్టుపక్కల ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వివరణ తీసుకుంటామని అన్నారు. వారందరినీ విచారణ చేసి, వీలైనంత త్వరగా నివేదిక ఉన్నతాధికారులకు ఇస్తామని తెలిపారు. నివేదిక అనంతరం స్కూల్‌పై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

పాఠశాల సీజ్ సరైంది కాదు

పాఠశాలను సీజ్ చేయడం సరైన నిర్ణయం కాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తారని తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చారు. విచారణకు వచ్చిన కమిటీతో మాట్లాడారు.. పాఠశాల సీజ్ చేయడం సరైంది కాదని, వారితో మాటల యుద్ధానికి దిగారు. తాము తల్లిదండ్రులతో మాట్లాడేందుకు రాలేదని.. జరిగిన సంఘటనపై విచారణకు మాత్రమే వచ్చామని చెప్పడంతో.. మమ్మల్ని ఎందుకు రమ్మన్నారని నిలదీశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఇక్కడే వేచి ఉన్నాం అని అన్నారు. పాఠశాలను సీజ్ చేస్తే తమ విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. విద్యార్థికి జరిగిన అన్యాయంలో తప్పు ఉంటే యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని, అందుకు విద్యార్థులను బలి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అనంతరం అధికారులకు విజ్ఞాపన పత్రం అందించారు.

'డాక్టర్ వైఎస్సార్ మ్యూజియం' కలను నిజం చేద్దాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : కార్యాలయాలను కొత్త కలెక్టరేట్‌లోకి మార్చాక పాత కలెక్టరేట్ భవనాన్ని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియంగా మార్చాలని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భావించారని, ఆ కలను నిజం చేసేందుకు అందరూ ముందుకు రావాలని నగర ప్రముఖులు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార తదితర అన్ని వర్గాల సంఘాల ప్రతినిధులు తీర్మానించారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో ఆదివారం పాత కలెక్టరేట్‌లోని సంస్థ కార్యాలయంలో ఆ భవన సంరక్షణకై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచనలు, సలహాలు ఇస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తొలుత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. అనంతరం చర్చను ప్రారంభిస్తూ పాత కలెక్టరేట్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలన్న డాక్టర్ వైఎస్సార్ కలను నిజం చేసేందుకు 'సీమ'కే తలమానికమైన ఈ భవనం జాతికి విలువైన వారసత్వ సంపదగా రక్షించుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ చేసిన కృషిని వృథా కానీయబోమని, ఐక్యంగా కృషి చేసేందుకు ముందుకు రావాలని తెలిపారు.

ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, కడప జ్యువెలరీ సంఘం గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి, డాక్టర్ కోట మృత్యుంజయరావు, డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ ఎంతో విలక్షణమైన, అత్యంత విలువైన పాత కలెక్టరేట్ భవనాన్ని రక్షించుకునే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని, ఇందులో డాక్టర్ వైఎస్సార్ పేరిట మ్యూజియాన్ని ఏర్పాటు చేద్దామని సూచించారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మునగా శ్రీనివాసులు, ధార్మికవేత్త వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు జోజిరెడ్డి, మధు, సూరిబాబు, మానవతా సంస్థ ప్రతినిధి బాల యల్లారెడ్డి తదితరులు మాట్లాడుతూ పాత కలెక్టరేట్ భవనాన్ని కాపాడుకోవడంతోపాటు దాదాపు 150 సంవత్సరాల నాటి ఈ భవనాన్ని యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించాలని, ఎందరు ప్రయత్నించినా గండికోట అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని, పాత కలెక్టరేట్ రక్షణ, మ్యూజియం ఏర్పాటు కూడా ఆయనతోనే సాధ్యమవుతుందన్నారు. ఏపీ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు సమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపైనే భారం వేయకుండా స్థానిక పారిశ్రామికవేత్తల సహకారంతో ఈ భవనాన్ని రక్షించుకుందామని సూచించారు. లయన్ సంజీవరెడ్డి, ఏఆర్ ప్రతినిధి స్వరూపరాణి, పోతుల ట్రస్టు చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, శైలేంద్రనాథ్, హోటలర్స్ సంఘం అధ్యక్షులు రషీద్‌ఖాన్, రెడ్డి సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, నాగమునిరెడ్డి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు, నగర ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లె : ఓ రిటైర్డు ఉపాధ్యాయుడి భార్యను నమ్మించి, రూ.25 లక్షల నగదు, 400 గ్రాముల బంగారు, మూడు ఇంటి స్థలాలు పొంది, వాటిని తిరిగి ఇవ్వాలని కోరితే చంపేస్తానని బెదిరించడమే కాకుండా మోసం చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె వన్ టౌన్ సీఐ మహబూబ్ బాషా తెలిపారు. పట్టణంలోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి రామచంద్ర పదవీ విరమణ చెందారు. ఆయన మరణానంతరం భార్య ఉమారాణి(60) మదనపల్లె పట్టణంలో ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో జీఆర్‌టీ హైస్కూల్‌లో కొంతం కాలం క్రితం జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుడు రామచంద్ర తరఫున ఆయన భార్య ఉమారాణి వేడుకల్లో పాల్గొంది. ఆ సమావేశానికి వచ్చిన కడప పట్టణానికి చెందిన సన్నీ అలియాస్ చందుచౌదరి(34) పరిచయం అయ్యాడు. విజయవాడలోని ఏపీఎండీసీలో కాంట్రాక్టు అటెండర్‌గా పని చేస్తున్నట్లు చెప్పాడు. ఇదే క్రమంలో సన్నీ మదనపల్లెకు వచ్చిన ప్రతిసారి ఉమారాణి కుటుంబసభ్యుడిగా కలిసిపోయి సాన్నిహిత్యం పెంచుకున్నాడు. తాను ఢిల్లీలో వ్యాపారం చేస్తున్నానని నమ్మించి, వ్యాపార అవసరాల కోసం నగదు అవసరమని చెప్పడంతో.. ఉమారాణి రూ.25 లక్షల నగదు, 400 గ్రాముల బంగారుతోపాటు హైదరబాదులో ఓ ప్లాటు, మదనపల్లెలో మరో రెండు ఇంటి స్థలాలు సన్నీ పేరిట రిజిస్టర్ చేయించి ఇచ్చింది. ఇవి తీసుకున్న తరువాత సన్నీ ఆమెకు కన్పించకుండా పోవడంతోపాటు, ఎన్ని సార్లు ఫోన్ చేసినా, తప్పించుకుని తిరుగుతున్నాడు. తన నగదు, నగలు, ఆస్తి తిరిగి ఇవ్వాల్సిందిగా పలుమార్లు అడిగినా వినకపోగా, ఆమెపై బెదిరింపులకు పాల్పడ్డాడు. చంపేస్తానని హెచ్చరించాడు. దీంతో బాధితురాలు ఉమారాణి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చందుచౌదరి అలియాస్ సన్నీపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు



చెట్టును ఢీకొని దెబ్బతిన్న కారు



తీవ్రంగా గాయపడిన బావాజాన్

ములకలచెరువు : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో అక్కాతమ్ముళ్లకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన బావాజాన్ తన అక్క హసీనా, పిల్లలను శ్రీసత్యసాయిజిల్లా నల్లచెరువులోని అత్తగారింటిలో వదిలివచ్చేందుకు కారులో వెళ్తుండగా ములకలచెరువు మండలం కదిరి రోడ్డు సరిహద్దులో అదుపు తప్పి చింతచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బావాజాన్(33), హసీనా(38)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ములకలచెరువు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, ఆటో ఢీ

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని బోయనపల్లె (రాజంపేట) వద్ద ఆదివారం లారీ, ఆటో ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజంపేట పెద్దాసుపత్రికి తరలించారు. మండలంలోని శవనవారిపల్లెకు చెందిన వారు నందలూరు నుంచి ఆటోలో రాజంపేటకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.